క్లుప్తంగా

కరాటేతో ఆత్మ రక్షణ



ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

దుబ్బాకటౌన్: ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని మాస్టర్ బురాణి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట, దుబ్బాకకు చెందిన సుమారు 100మంది విద్యార్థులకు బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. 18మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వారికి కరాటే మాస్టర్ సర్టిఫికెట్లు, బెల్ట్‌లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కరాటే నేర్పించాలనే లక్ష్యంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నానన్నారు.

108లో మహిళ ప్రసవం



బిడ్డను చూపుతున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. ఈ ఘటన మండల పరిధిలోని మైలారంలో సోమవారం జరిగింది. మైలారం గ్రామానికి చెందిన మహ్మద్ ఫర్వీన్ పురుటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది కిషన్, వెంకట్ అక్కడకు చేరుకుని మహిళను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమెకు నొప్పులు ఎక్కువై అంబులెన్స్‌లోనే ఆడబిడ్డను ప్రసవించింది.

పథకాలు అందేలా చూస్తా..



మల్లేశంను సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్/చేర్యాల(సిద్దిపేట): అర్హులైన పద్మశాలీలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని అభ్యర్థి బూర మల్లేశం ఆ సంఘం నాయకులను కోరారు. ఎన్నికల సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివభక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 18న నిర్వహించనున్న ఎన్నికల్లో రాట్నం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. రాష్ట్రమంతా సేవా కార్యక్రమాలు నిర్వహించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కస్తూరి సతీశ్, శ్రీనివాస్, కోమటి సత్యనారాయణ, బూర్ల రాజయ్య, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

భూముల హద్దులు చూపండి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గతంలో ప్రభుత్వమిచ్చిన భూములకు హద్దులు చూపాలని కోరుతూ మందాపూర్, పలుగుగడ్డ గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలో సర్వే నంబర్ 445లో రెండు వందల మంది రైతులకు పట్టాలు ఇచ్చిందన్నారు. కానీ హద్దులు చూపకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీన్ని సాకుగా తీసుకొని కొంతమంది రియాల్టర్లు భూమిని కబ్జా చేస్తున్నారని వాపోయారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్‌దృష్టికి తీసుకపోయి సమస్యను పరిష్కరిస్తామని, కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లతో ఎస్ఐ ఆసీఫ్

నంగునూరు(సిద్దిపేట): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం సిబ్బందితో కలసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బద్దిపడగ వద్ద ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేశామన్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో తంగళ్లపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్లు రాయవేణి రమేశ్, రాధారం తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట

- పోలీసు కమిషనర్ అనురాధ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ ఆదేశించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, భరోసా, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సిబ్బందితో సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం హాట్‌స్పాట్‌ల వద్ద ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని, ఈవ్ టీజింగ్ జరిగే ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలల వద్ద షీ టీమ్ సిబ్బంది ఫోన్ నంబర్లుతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. కొమటి చెరువు, పాండవుల చెరువు, ఆక్సిజన్ పార్క్, అర్బన్ పార్క్, బస్టాండ్‌లు, కళాశాలల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అలాగే భరోసా సిబ్బంది తరచూ షీటీమ్ కార్యక్రమంలో పాల్గొని మైనర్లకు అందిస్తున్న సేవల గురించి వివరించాలని చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం హాట్‌స్పాట్‌ల వద్ద విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మల్లారెడ్డి, సీఐ దుర్గ, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల షీ టీమ్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది, మహిళా సపోర్ట్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులతో మరింత బాధ్యత

పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సుభాష్‌ను ఆమె అభినందించారు. పోలీసుశాఖలో బాధ్యతగా నిబద్దతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీదర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీసీఎస్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.అంజయ్య సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి, భద్రతలకు పెద్దపీట వేయాలని, పెండింగ్ ప్రాపర్టీ కేసులను పరిష్కరించాలని సూచించారు.

పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- మెరుగు కృష్ణ



మాట్లాడుతున్న మెరుగుకృష్ణ గౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మోకుదెబ్బ మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18న జరిగే పాపన్న జయంతి ఉత్సవాలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని గౌడ సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తాడిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించినవారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, నర్సింహులు గౌడ్, శ్రీనివాస్, గురువయ్య గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, రమేశ్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వేడుకలకు వాలంటీర్



సిద్దిపేటఎడ్యుకేషన్: ఢిల్లీలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎస్.భాను ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత సోమవారం మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో చురుకుగా పని చేస్తూ స్వాతంత్య్ర వేడుకలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. వాలంటీర్ భానును ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి డాక్టర్ శ్రద్ధానందం, అధ్యాపకులు అభినందించారు.

పంచాయతీకి కేటాయించిన భూమి కబ్జా

- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీకి కేటాయించిన ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ సర్పంచ్ భానోతు రవీందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రెవెన్యూశాఖ సీనియర్ అసిస్టెంట్ మాలోతు కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 465లో రెండెకరాల ప్రభుత్వ భూమిని పంచాయతీకి కేటాయించారన్నారు. అందులో డంప్‌యార్డు, శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణం, నూతన పంచాయతీ భవనం నిర్మించాలని నిర్ణయించామని చెప్పారు. కాని పక్కనున్న కొందరు రైతులు దానికి ఆక్రమించి పట్టా చేయించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు భూక్య వీరన్న, గోపి, భానోతు భాస్కర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ కార్యదర్శిగా అనిల్



నియామకపత్రం అందజేస్తున్న నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా చర్లఅంకిరెడ్డిపల్లికి చెందిన చిక్కుడు అనిల్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు డా.సూర్యవర్మ, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ప్రశాంత్, రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మూడు గ్రామాల్లో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు మండలంలోని పలుగుగడ్డ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 43కిలోల కాపర్, 120లీటర్ల ఆయిల్, దౌలాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 230లీటర్ల ఆయిల్, లింగారెడ్డిపల్లి గ్రామంలో 120లీటర్ల ఆయిల్, కండక్టర్ కేబుల్ చోరీకి గురైనట్లు తెలిపారు. వాటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని చెప్పారు. విద్యుత్ ఏఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబెల్లం పట్టివేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరానికి చెందిన వనిశెట్టి విప్రజ్ఞ కిరాణా దుకాణంలో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 30 కిలోల నల్లబెల్లం, 1.600కిలోల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 16లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, జనవరి 18న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

చేర్యాల(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాక రూరల్/కొండపాక(గజ్వేల్): చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.39,01,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. సోమవారం పట్టణ కేంద్రంలోని రేణుక గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో చేర్యాల–79, కొమురవెల్లి–31, మద్దూరు–22, దూళ్మిట్ట–15మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వీరన్నపేటలో ఏర్పాటు చేసిన చాకలి అయిలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే మిరుదొడ్డికి చెందిన లాల్‌గారి రాములు, ఐలయ్య, రంగనబోయిన లక్ష్మి, ఎండీ మక్బూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో చందపురం మల్లేశం, తుమ్మల బాల్‌రాజు, గొట్టం భైరయ్య పాల్గొన్నారు. దుబ్బాక మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన కె.సత్యానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2లక్షలు చెక్కును కాంగ్రెస్ నాయకులు విజయ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. కొండపాక మండల పరిధిలోని దుద్దెడలో కాట ఎల్లం పేరిట మంజూరైన రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ అందజేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు దారుణం

దుబ్బాకటౌన్/సిద్దిపేటజోన్/సిద్దిపేటకమాన్/గజ్వేల్ రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు దారుణమని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బ అశోక్ గుప్తా అన్నారు. ఆ మారణకాండను నిరసిస్తూ సోమవారం దౌల్తాబాద్‌లో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భూపాల్ రెడ్డి, వేణుగోపాల్, తిరుపతి, కిషన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేటలో స్వచ్ఛందంగా బంద్ నిర్వహిస్తున్నామని, అలాగే వెంకటేశ్వర ఆలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాజారామ్ పాల్కొన్నారు. గజ్వేల్‌లో మంగళవారం తలపెట్టిన బంద్‌ను, నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురవారెడ్డి పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

- ఎంపీ రఘునందన్‌రావు



సమస్యలు వింటున్న రఘునందన్‌రావు

దుబ్బాక: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు ప్రజలకు సూచించారు. సోమవారం దుబ్బాక వంద పడకల ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్‌తో పాటు మరికొంత మంది వైద్య నిపుణులులేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే 108 అంబులెన్స్‌ను తనిఖీచేసి, సేవల గురించి సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ల కొరత వల్ల ఆసుపత్రికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. భవిష్యత్‌లో మరో రెండు అంబులెన్స్‌లను ఆసుపత్రికి ఇవ్వడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్, కౌన్సిలర్ మల్లారెడ్డి, బీజేపీ నాయకులు బాలేశ్‌గౌడ్, సుభాష్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నివాళులర్పిస్తున్న యాదగిరి తదితరులు

వర్గల్(గజ్వేల్)/చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాక టౌన్/మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వర్గల్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, వరలక్ష్మి, కేజీబీవీ స్పెషలాఫీసర్ రజిత, భూపాల్, జనార్దన్, శ్రీకాంత్, కృష్ణవేణి, కవిత తదితరులు పాల్గొన్నారు. చేర్యాల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కోరారు. కేజీబీవీ ఎస్ఓ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దుబ్బాక టౌన్ పరిధిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు అక్కం శేఖర్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు గాడి రాజు, పెంటయ్య, చంద్రమౌళి, నగేశ్, మనోహర్, మల్లేశం తదితరులున్నారు. మిరుదొడ్డి మండల వనరుల కేంద్రంలో మహేశ్, కిష్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మతిన్, స్వామి, బాలరాజు, నర్సింహులు, యాదయ్య, రాజు, ప్రవీణ్, పీటీఐలు వెంకటి, పెంటయ్య పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్‌లోని కేజీబీవీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబాల్లో అర్హత కలిగిన వారికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లాలో భూ సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలం చెందారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్ రెడ్డి ఆరోపించారు. మండల కార్యాలయం ఎదుట తిగుల్ గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో నాలుగు ప్రాజెక్టులను నిర్మించారని, ఆ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన 22మంది రైతులు నేటికీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షపతి, లింగం, కృష్ణ, రాజేశం, రాములు, రాంచంద్రం, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మెరుగైన విద్య



క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మెరుగైన విద్యను అందించడానికి అందరి సహకారం అవసరమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి హైస్కూల్లో మార్స్ ఇండియా కంపెనీ సౌజన్యంతో విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి పెద్దపీట వేస్తున్నప్పటికీ కార్పొరేట్ కంపెనీల చేయూత అవసరమన్నారు. ఏకరూప దుస్తులతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థులు క్రీడలపై ఆకర్షితులయ్యేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలలో 17మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.19 వేలు జరిమానా విధించారు. ఇద్దరికి రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **విద్యార్థుల కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్: విద్యార్థుల సమస్యలపై పోరాటంలో ఏఐఎస్ఎఫ్ ముందంజలో ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 89వ ఆవిర్భావ వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ 89యేళ్లుగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. జనార్దన్, ప్రసన్నకుమార్, శంకర్, లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా బాలికల కన్వీనర్ ఆకుల శిరీష, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్ మాట్లాడారు. మహమ్మద్ యాసిన్, హనుమాన్, హర్షవర్ధన్, చందు పాల్గొన్నారు. గజ్వేల్ ఇందిరా పార్కు చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో నరేశ్, రాములు, రామచంద్రం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.హుస్నాబాద్‌లో వేల్పుల ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోనవీన్, అరుణ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

◆ **జనగామ ఎమ్మెల్యే పరామర్శ**

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాదసు శ్రీహరి కుటుంబ సభ్యులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పిల్లల చదువు కోసం అయ్యే ఖర్చులు భరిస్తానని, మృతుడి భార్యకు అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మాజీ సర్పంచ్ కరుణాకర్, కిషన్ ఉన్నారు.

◆ **ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు**

నంగునూరు(సిద్దిపేట): పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ కిషన్, వైద్యాధికారి శ్రీజ సూచించారు. రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం చేర్యాల వైద్యబృందం సభ్యులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫార్మసిస్ట్ రంజిత్ కుమార్, ఏఎన్ఎం శ్వేత తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారమే ధ్యేయం**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్‌టీఎఫ్ఐ(స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ముందుకు సాగుతోందని రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గజ్వేల్‌లో పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో షేక్ వలీఅహ్మద్, రవీందర్, వెంకటకిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్మికులకు చట్ట భద్రత కల్పించాలి**

సిద్దిపేటకమాన్: అసంఘటిత కార్మికులకు చట్ట భద్రత కల్పించాలని బీఎఫ్‌టీయు జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ దేశంలో అసంఘటిత రంగంలో కార్మికులకు భద్రత కరువైందని, తమ హక్కుల కోసం కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

◆ **కార్పొరేషన్ ఏర్పాటు చేయండి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ సంక్షేమనిధి ద్వారా రూ.250 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు.

◆ **హరిత వార్డుగా తీర్చిదిద్దుతాం**

దుబ్బాకటౌన్: మొక్కల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వవార్డులో ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. 3వ వార్డును హరిత వార్డుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. వార్డులో దాదాపు 1000 మొక్కలను పంపిణీ చేశామని, వాటిని సంరక్షించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

సిద్దిపేటజోన్: పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పారిశుద్ధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని, అలాగే పారిశుద్ధ్య కార్మికులకు మూడేళ్లుగా పీఎఫ్ డబ్బులు జమ చేయడం లేదని ఆరోపించారు. వెంటనే పీఎఫ్ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు, ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ పాండ అక్కడికి వచ్చి కార్మికులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.